క్లుప్తంగా

డైరెక్టర్ల సమన్వయంతో వర్సిటీ అభివృద్ధి


ప్రొఫెసర్ బాలకృష్ణను అభినందిస్తున్న ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ

బాలాజీచెరువు: డైరెక్టర్ల సమన్వయంతో వర్సిటీ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ మురళీకృష్ణ పేర్కొన్నారు. యూనివర్సిటీ డైరెక్టర్లుగా బాధ్యతలు స్వీకరించిన పలువురు ప్రొఫెసర్లను బుధవారం వారి చాంబర్‌కు వెళ్లి అభినందించారు. డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ ప్లానింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.బాలకృష్ణ, డీఈ పద్మజారాణి, ఫారస్ వర్సిటీ డైరెక్టర్ స్వర్ణకుమారి, ఫార్మసీ ప్రత్యేక అధికారి పద్మప్రియ, ఐక్యూఏసీ డైరెక్టర్ కృష్ణప్రసాద్‌లను అభినందించారు. రెక్టార్ కేవీ రమణ, ఐఎస్‌టీ డైరెక్టర్ ప్రొఫెసర్ మురళీకృష్ణ, టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది వారిని అభినందించారు.

8న ఎస్‌ఎంసీ ఎన్నిక

కరప: ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్‌ఎంసీ (స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నికలకు ఆయా పాఠశాలల్లో గురువారం నోటిఫికేషన్ విడుదల కానున్నట్లు ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ తెలిపారు. కరపలో బుధవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 8వ తేదీన ఉదయం 7 గంటల నుంచి ఎన్నికలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం నుంచి ఎన్నికైన పేరెంట్స్ నుంచి ఒక చైర్మన్, ఒక వైస్‌చైర్మన్‌ను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు.

డీఎస్పీ హనుమంతరావు బదిలీ

కాకినాడ క్రైం: కాకినాడ లా అండ్ ఆర్డర్ డీఎస్పీ కె.హనుమంతరావును బదిలీ చేస్తూ బుధవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సాధారణ బదిలీల్లో భాగంగా స్థాన చలనం పొందిన ఆయనను హెడ్ క్వార్టర్స్‌కు రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

డెంగీ, డయేరియాలపై అవగాహన


ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆర్‌ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ దేవీ మాధవి

కాకినాడ క్రైం: కాకినాడ రంగరాయ వైద్య కళాశాలకు చెందిన కమ్యూనిటీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన వైద్యులు, వైద్య విద్యార్థులు ప్రజాక్షేత్రంలో మమేకమయ్యారు. మంగళ, బుధవారాలలో కాకినాడ, రామేశ్వరంలో విస్తృతంగా పర్యటించారు. ప్రస్తుతం జిల్లాను పట్టి పీడిస్తున్న తీవ్ర జ్వరాలు, డెంగీ, డయేరియాలపై ప్రజల్లో అవగాహన కల్పించారు. అతిసారం సంభవించే తీరు, తీసుకోవలసిన జాగ్రత్తలు, చేతి శుభ్రత, ఓఆర్‌ఎస్ ద్రావణ తయారీని వివరించారు. ఫ్రైడే డ్రైడే ప్రాధాన్యం, వ్యక్తిగత పరిశుభ్రత వల్ల కలిగే లబ్ధిని తెలియజేస్తూ లఘు నాటికను ప్రదర్శించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ప్రొఫెసర్, కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌ఓడీ డాక్టర్ బి.దేవీ మాధవి, డాక్టర్ ఎల్.సౌమ్య, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రుక్మిణీదేవి తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అరుదైన శస్త్ర చికిత్స


వైద్య బృందాన్ని, సూపరింటెండెంట్ లావణ్యకుమారిని అభినందిస్తున్న బాధితురాలు

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో ఓ రోగికి అరుదైన వైద్యం చేసి ప్రాణాలు నిలిపారు. అంతర్వేది మండలం బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన ఓ మహిళ కొద్ది రోజుల క్రితం జ్వరం, ఫిట్స్‌తో రాజమహేంద్రవరంలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో చేరారు. అక్కడి వైద్యుల ప్రయత్నం ఫలించకపోవడంతో ఆమె జీజీహెచ్‌లో చేరారు. సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి ఆధ్వర్యంలో న్యూరో సర్జరీ ఇన్‌చార్జి హెచ్‌ఓడీ డాక్టర్ ఎస్ఎం షరీఫ్, డాక్టర్ రవితేజ ఆమెకు పోస్ట్ వైరల్ 'సూపర్ రిఫ్రాక్టరీ స్టేటస్ ఎపిలెప్టికస్' అనే వ్యాధిగా నిర్ధారించి ఖరీదైన ఐవీ, ఐజీలతో వైద్యం అందించారు. ఆరోగ్య శ్రీ ఉండడంతో ఆమెకు నిరాటంకంగా వైద్యం అంది ప్రాణాపాయం నుంచి బయటపడింది.

యుద్ధ విమాన పార్కు అభివృద్ధికి చర్యలు

కాకినాడ రూరల్: స్థానిక ఎన్టీఆర్ బీచ్‌లో యుద్ధ విమాన పార్కును ఎమ్మెల్యే పంతం నానాజీ బుధవారం సందర్శించారు. కూడా వీసీ కృష్ణమూర్తి, ఇతర అధికారులతో కలిసి పార్కును పరిశీలించి పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మచ్చలేని జీవితానికి..

- కాకినాడలో కొనసాగుతున్న లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్
- సత్ఫలితాలనిస్తున్న సర్వే
- అర్బన్, రూరల్‌లో కొత్త కేసుల గుర్తింపు


కుష్టు మచ్చల చిత్రాలను చూపి అవగాహన కలిగిస్తున్న డాక్టర్ చక్రధర్ బృందం

కాకినాడ క్రైం: 'మచ్చ' లేని స్వచ్ఛమైన జీవితానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. కుష్టు రహిత సమాజాన్ని నిర్మించేందుకు వైద్య ఆరోగ్యశాఖ నడుం బిగించింది. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ పేరుతో సుమారు 15 రోజులుగా ఆ దిశగా జల్లెడ పడుతున్నారు. అనుమానిత కేసులను గుర్తించేందుకు మచ్చతో యుద్ధమే చేస్తున్నారు. అనుమానిత మచ్చలపై పరీక్షలు అనివార్యం చే అర్బన్, గ్రామీణ మండలాల్లో కొన్ని లెప్రసీ కేసులను గుర్తించారు. అనుమానిత మచ్చలు, కుష్టు వ్యాధి లక్షణాల నిర్ధారణకు సిఫార్సు చేస్తున్నారు. ఆశా, ఆరోగ్య కార్యకర్తలను ఇందుకు వినియోగిస్తున్నారు.

అవగాహన కల్పిస్తారు...

ఈ ప్రచారంలో బ్యానర్లు, పోస్టర్లు, పాంప్లెట్ల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించనున్నారు. కుష్టు వల్ల అనర్థాలు వివరించి, దానిని గుర్తించడం వల్ల ప్రయోజనాలను ర్యాలీలు, నాటక ప్రదర్శనల ద్వారా అవగాహన కలిగిస్తున్నారు. అలాగే ఆయా కుటుంబ సభ్యులకు పోస్ట్ ఎక్స్‌పోజర్ ప్రొఫైలాక్సిస్ (పీఏపీ)గా సింగిల్ డోస్ రిఫాంసిన్ మందులు ఉచితంగా ఇచ్చి వ్యాధి తీవ్రతను తగ్గిస్తారు. అప్పటికే వ్యాధి ఉన్నవారి కోసం ఏడాదిలో రెండు సార్లు ఎంసీఆర్ చెప్పులు, స్వీయ రక్షణ పరికరాలు, మందులను ప్రభుత్వం తరఫున ఉచితంగా అందిస్తారు.

అర్బన్‌లో 35, రూరల్‌లో 25,

సుమారు రెండు వారాల క్రితం ప్రారంభమైన ఈ సర్వే కాకినాడ అర్బన్, గ్రామీణ మండలాలలో సాగుతోంది. అర్బన్‌లో నిత్యం 35, గ్రామీణంలో 25 చొప్పున ఇంటింటి సర్వేలు చేస్తూ ఆ వివరాలను ప్రత్యేక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి రాష్ట్రస్థాయి నివేదికకు సమర్పిస్తున్నారు.

రోగం గుర్తిస్తే..

తాజా సర్వేలో పలువురిలో రోగ లక్షణాలు బయటపడగా అటువంటి వారికి స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో ఉచితంగా మందులు అందిస్తున్నారు. వ్యక్తి శరీరంపై ఐదు, అంతకంటే తక్కువ మచ్చలుంటే ఆ స్థితిని ప్యాసీ బ్యాసిలరీ అంటారు. ఇటువంటి రోగికి కనీసం ఆరు నెలల వైద్యం అందిస్తారు. ఒకవేళ ఎక్కువ ఉంటే ఆ స్థితిని మల్టీ బ్యాసిలరీ అంటారు. ఇటువంటి రోగులకు ఏడాది ట్రీట్మెంట్ అవసరం అవుతుంది. బాధితులకు బహుళ ఔషధ చికిత్స అందిస్తారు. దీనినే ఎండీటీ అంటారు.

ముట్టుకుంటే వచ్చే వ్యాధికాదు

కుష్టు వ్యాధిపై చాలా మందిలో అనేక అపోహలు ఉన్నాయి. ముట్టుకుంటే వస్తుందనీ, శాపం అని, పేద వాళ్లకు మాత్రమే వచ్చే వ్యాధి అని, వంశ పారంపర్యంగా వస్తుందనే అపోహ ఇప్పటికీ ఉంది. అయితే ఇవేవీ నిజం కాదని కాకినాడలో కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న డాక్టర్ వైఎస్ చక్రధర్ తెలిపారు. వ్యాధి సోకిన వ్యక్తి మందులు వాడకుండా తుమ్మినా, లేదా దగ్గినా ఆ తుంపర్ల నుంచి మరో వ్యక్తికి వ్యాధి సంక్రమిస్తుందన్నారు. అలా సోకిన క్రిమి శరీరంలో రోగ నిరోధక శక్తిని బట్టి కనీసం ఏడాది నుంచి 20 ఏళ్ల మధ్య కుష్టు రోగం బయట పడుతుందని తెలిపారు. కాబట్టి, వ్యాధి బారిన పడే వారు తప్పకుండా మందులు వాడడం ద్వారా వారిని వారు రక్షించుకోవడంతో పాటు ఇతరుల ప్రాణాలను రక్షించవచ్చని డాక్టర్ చక్రధర్ తెలిపారు.

ఇవీ లక్షణాలు...

- చర్మంపై స్పర్శ, నొప్పి, దురద లేని మచ్చలు
- చర్మంపై ఎర్రని లేదా రాగి రంగు మచ్చలు
- చెవులు, వీపు, ఛాతిపై బొడిపెలు
- కనురెప్పలు పూర్తిగా మూయలేకపోవడం
- కంటి రెప్పలు, కనుబొమల వెంట్రుకలు రాలిపోవడం
- నరాల నొప్పి, చేతులు, పాదాలు, నరాల తిమ్మిర్లు
- అరచేతులు, పాదాలలో స్పర్శ కోల్పోవడం, పొడిబారడం, నొప్పి, పుండ్లు ఏర్పడడం
- చేతి, కాళ్ల వేళ్ల వంకర్లు తిరిగి అంగవైకల్యం ఏర్పడడం
- కాళ్ల నుంచి చెప్పులు, చేతుల నుంచి వస్తువులు జారిపోవడం
- మణికట్టు లేదా మడమను పైకి లేపలేకపోవడం
- చల్లని, వేడి వస్తువులను తాకినా గుర్తించలేకపోవడం

నిర్లక్ష్యం చేస్తే అంగవైకల్యం తప్పదు



చర్మంపై అనుమానిత మచ్చలను నిర్లక్ష్యం చేస్తే కుష్టుకు దారి తీయవచ్చు. అటువంటి స్థితి కొనసాగితే అంగవైకల్యం తప్పదు. నగరంలో కలెక్టర్ షాన్‌మోహన్, డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్‌ల సంయుక్త పర్యవేక్షణలో 90 శాతానికి పైగా సర్వే పూర్తి చేశాం. క్షేత్రస్థాయి సిబ్బంది శ్రమిస్తున్నారు. వారి కష్టం వల్లే సత్ఫలితాలు రాబట్టగలిగాం. నిర్ణీత గడువు లోపు నూరు శాతం లక్ష్యాన్ని చేరుకుంటాం.

– డాక్టర్ రోణంకి రమేష్, జిల్లా లెప్రసీ ఎయిడ్స్, క్షయ నివారణాధికారి


వ్యక్తి శరీరంపై అనుమానాస్పద మచ్చలను పరీక్షిస్తున్న డాక్టర్ చక్రధర్

కమిషనర్‌కు ఎమ్మెల్యేల అభినందన


ఎమ్మెల్యే, నాయకులతో మాట్లాడుతున్న కమిషనర్ భావన

కాకినాడ: కాకినాడ సిటీ, రూరల్ శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీ బుధవారం నగరపాలక సంస్థ కమిషనర్ భావనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవలే కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆమెకు నగరపాలక సంస్థ కార్యాలయంలో అభినందనలు తెలిపారు. ఇరువురు ఎమ్మెల్యేలూ తమ నియోజకవర్గం పరిధిలోని పలు అభివృద్ధి అంశాలు, సమస్యలపై కమిషనర్‌తో చర్చించారు. వీరి వెంట ఆయా నియోజకవర్గాల నాయకులు ఉన్నారు.

ఎలక్ట్రికల్ బైక్ దగ్ధం

కాకినాడ క్రైం: కాకినాడలోని ఆనంద భారతి మైదానంలో ఓ ఎలక్ట్రికల్ బైక్ బ్యాటరీ షార్ట్ సర్క్యూట్‌తో కాలి బూడిదైంది. నగరానికి చెందిన వాసంశెట్టి సంతోష్ అనే వ్యక్తి భానుగుడి నుంచి కల్పన సెంటర్ వైపు బుధవారం టీవీఎస్ కంపెనీకి చెందిన తన ఎలక్ట్రికల్ ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. ఈ క్రమంలో వాహనం ఆనంద భారతి గ్రౌండ్ వద్దకు వచ్చే సరికి వాహనం లోపలి నుంచి పొగలు రావడం ప్రారంభమైంది. దీంతో కంగారు పడ్డ సంతోష్ తనతో పాటు మరెవరికీ ఏ హాని జరగకూడదనే ఉద్దేశంతో ఆనంద భారతి గ్రౌండ్‌లోకి తీసుకు వెళ్లి తన వాహనాన్ని ఆపి ఇంజన్ ఆఫ్ చేశాడు. మంటలు అంతకంతకూ పెరిగి వాహనం పూర్తిగా కాలి దగ్ధమైంది. అక్కడికి చేరుకున్న డీఎఫ్‌వో సుబ్బారావు ఆధ్వర్యంలోని సాలిపేట ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. రూ.1.2 లక్షల ఆస్తి నష్టంగా నిర్ధారించారు.

స్మార్ట్ సిటీ సమస్యలు పరిష్కరించాలి


కాకినాడ మున్సిపల్ కమిషనర్ భావనకు వినతి పత్రం సమర్పిస్తున్న బీజేపీ నాయకులు

బోట్‌క్లబ్: కేంద్ర ప్రభుత్వం కాకినాడ నగరాన్ని 2016లో స్మార్ట్ సిటీగా ప్రకటించి కోట్లాది రూపాయలు కేటాయించినప్పటికీ ప్రధాన సమస్యలు ఇప్పటికీ వేధిస్తూనే ఉన్నాయని బీజేపీ ఆరోపించింది. పార్టీ కాకినాడ నగర్ కన్వీనర్ గట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం ప్రజా సమస్యలు పరిష్కరించాలని కమిషనర్ భావనకు వినతి పత్రం అందించారు. శానిటరీ పనిముట్లు కొనేందుకు సీఎస్సార్ నిధులు వాడాల్సిన దుస్థితి ఉందంటే కార్పొరేషన్ దివాలా తీసినట్టు ప్రజలు భావిస్తున్నారన్నారు. నగరంలో సుమారు రూ. 100 కోట్ల స్మార్ట్ సిటీ నిధులు ఖర్చు చేసి కమాండ్ కంట్రోల్ సిస్టమ్ ఏర్పాటు చేశారని, సుమారు 350 సీసీ కెమెరాలు, జీపీఎస్, పబ్లిక్ అనౌన్స్మెంట్ సిస్టం పనిచేసేందుకు కీలకమైన ఈ కమాండ్ కంట్రోల్ సిస్టం గత మూడేళ్లుగా పనిచేయడం లేదన్నారు. తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, నగరంలోని శివారు ప్రాంతాల్లోనే కాకుండా, నగర నడిబొడ్డున కూడా నీటి సమస్య ఉందన్నారు. వీధి దీపాలు, పలు రహదారుల్లో గోతుల సమస్యలు పరిష్కరించాలన్నారు.

ప్రజల భాగస్వామ్యంతో పనిచేయాలి

- పారిశుధ్య కార్మికులకు కమిషనర్ భావన పిలుపు
- పలు ప్రాంతాల్లో పనుల పరిశీలన


పారిశుధ్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న కమిషనర్ భావన

కాకినాడ: ప్రజల భాగస్వామ్యంతో పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన పారిశుధ్య కార్మికులకు పిలుపునిచ్చారు. బుధవారం టిడ్కో గృహ సముదాయంలోని పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. 3, 4 సర్కిళ్ల పరిధిలోని డైరీ ఫారం సెంటర్, అయోధ్య నగర్ ప్రాంతాల్లోని మస్తర్ కేంద్రాలను కూడా ఆమె సందర్శించారు. అక్కడి పారిశుధ్య కార్మికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన పారిశుధ్య నిర్వహణ ద్వారా ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలంటే ప్రజల భాగస్వామ్యంతో సమిష్టిగా పని చేయాలని సూచించారు. కార్మికులకు ఎటువంటి సమస్య ఉన్న తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజలు సహకరించి తడి–పొడి చెత్తను వేరువేరుగా ఇళ్ల వద్దకు వచ్చే పారిశుధ్య కార్మికులకు మాత్రమే అందజేయాలని సూచించారు. మస్తరు కేంద్రాల వద్ద రిజిస్టర్లను తనిఖీ చేసి సిబ్బంది హాజరవుతున్న సమయాన్ని ఆరా తీశారు. అలాగే వివిధ దశల్లో ఉన్న అన్న క్యాంటీన్ల అభివృద్ధి పనుల ప్రగతిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, ఈఈ మాధవి, ఏఈలు వై.నాగేశ్వరరావు రమేష్ బాబు, శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన


సదస్సులో అవగాహన కల్పిస్తున్న పరిశ్రమల శాఖ ఏడీ కృష్ణార్జునరావు

కాకినాడ రూరల్: ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు రమణయ్యపేటలోని జిల్లా పరిశ్రమల కేంద్రం కార్యాలయంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో సదస్సు ఏర్పాటు చేశారు. సింగిల్ విండో ద్వారా 21రోజుల్లో వివిధ రకాల అనుమతులు ఏవిధంగా పొందాలో పరిశ్రమల శాఖ ఏడీ కృష్ణార్జునరావు వివరించారు. 2023–27 ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ ద్వారా ప్రభుత్వం కల్పించే రాయితీలు, పీఎంఈజీపీ ద్వారా రాయితీలు, క్లస్టరు డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా ప్రయోజనాలు తదితర వాటి గురించి వివరించారు. రాజమహేంద్రవరం ఏపీ ఆర్థిక సంస్థ బ్రాంచి మేనేజరు కోటేశ్వరరావు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అందే రుణ సదుపాయం గురించి తెలియజేసి, సందేహాలు నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఐపీఓలు రమణారావు, దొర, బాల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ సిటీ: ఈ నెల రెండో తేదీ శుక్రవారం కాకినాడ డీ1 సెక్షన్ పరిధిలోని జీజీహెచ్ విద్యుత్ సబ్ స్టేషన్ వార్ఫు రోడ్డు ఫీడర్‌పై వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ జి.ప్రసాద్ బుధవారం తెలిపారు. ఈ కారణంగా వార్ఫు రోడ్డు, ధనమ్మ తల్లి గుడి ఏరియా, దిగుమర్తి వారి వీధి, దేవాలయం వీధి, పెంకేవారి వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

డి7 సెక్షన్ పరిధిలో..

కాకినాడ డి7 సెక్షన్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఫీడర్ మరమ్మతులు, చెట్లు కొమ్మలు తొలగించేందుకు 33/11 కేవీ డైరీఫాం విద్యుత్ సబ్–స్టేషన్ పరిధిలోని 11 కేవీ రెవెన్యూ కాలనీ ఫీడర్‌పై గల రెవెన్యూ కాలనీ, స్వర్ణాంధ్ర కాలనీ, ఏఎంజీ రోడ్డు, రాజీవ్ గృహకల్ప బ్లాక్స్ డైరీ ఫాం, నూకాలమ్మ మాన్యం ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

అన్నమ్మ ఘాటీ ప్రాంతంలో..

అన్నమఘాటీ విద్యుత్ ఉపకేంద్రం వార్షిక మరమ్మతుల నిమిత్తం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ ప్రసాద్ తెలిపారు. దీని వల్ల నరసింహ రోడ్డు, శివాలయంవీధి, తారకరామనగర్, ఘాటీ సెంటర్, కొవ్వూరు రోడ్డు, సుందర్‌నగర్, పప్పుల మిల్లు ప్రాంతం, రిక్షాల పేట, పరదేశమ్మపేట, ప్రసాదరావు నగర్, సత్యదేవి నగర్, ముగ్గుపేట, రెల్లిపేట, బాపూజీనగర్, పద్మనాభనగర్, మేకా నారాయణమ్మతోట, కాపుల వీధి, మున్సిఫ్ జంక్షన్, కొవ్వూరు, డీ మార్ట్, శుభం కౌంటీ, తూరంగి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ప్రసాద్ తెలిపారు. ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కనీస ధరతో సన్నబియ్యం ఇవ్వండి

- సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం
- ప్రజా పంపిణీ వ్యవస్థపై సమీక్ష


ప్రజా పంపిణీ వ్యవస్థపై నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్ మోహన్

కాకినాడ సిటీ: నాణ్యమైన సన్న బియ్యం కనీస ధర నిర్ణయించి విక్రయిస్తే ప్రజలు వంద శాతం వినియోగించుకునే అవకాశం ఉందని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులకు సూచించారు. ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కార్డుదారులకు, అంగన్‌వాడీ సెంటర్లకు, సంక్షేమశాఖ హాస్టళ్లు, మధ్యాహ్న భోజన పథకాలకు పంపిణీ చేస్తున్న బియ్యం నాణ్యతపై కలెక్టర్ షాన్ మోహన్ బుధవారం వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఫోర్టిఫైడ్ బియ్యం బాగానే ఉన్నాయని, మరిన్ని రకాల సన్నబియ్యాన్ని కనీస ధరకు అందజేయాలన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ అమలు తీరు, సరుకుల నాణ్యత తదితరాలపై కార్డుదారులు, లబ్ధిదారుల నుంచి అభిప్రాయాలు సేకరించేందుకు సర్వే నిర్వహించి నివేదికను అందజేయాలని పౌర సరఫరాల ఉప తాహసీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. ప్రజాపంపిణీ వ్యవస్థ పటిష్ట అమలుకు రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతానికి పాటించాల్సిన విధి విధానాలను చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి తిప్పేనాయక్, పౌర సరఫరాల సంస్థ అధికారులు, విద్యాశాఖ, తూనికలు కొలతలు, వ్యవసాయ మార్కెటింగ్, సాంఘిక సంక్షేమ, గిరిజన, మహిళా శిశు సంక్షేమం, వెనుకబడిన తరగతులు సంక్షేమ శాఖ అధికారులు, వినియోగదారుల, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రేషన్‌షాపు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్ల ప్రతినిధులు, సివిల్ సప్లైస్ డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి ఎస్పీ సత్కారం


పదవీ విరమణ పొందిన అధికారులు, సిబ్బందిని సత్కరించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్

కాకినాడ క్రైం: వివిధ హోదాల్లో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన పలువురు అధికారులు, సిబ్బందిని ఎస్పీ విక్రాంత్ పాటిల్ బుధవారం ఆయన కార్యాలయంలో సత్కరించారు. పదవీ విరమణ పొందిన ఇంద్రపాలెం ఎస్సై పి.వెంకటేశ్వరరావు, డీఎస్‌బీ ఎస్సై వి.సూర్యప్రసాద్, గండేపల్లి ఏఎస్సై కె.వరకుమార్, కాకినాడ ట్రాఫిక్–2 ఏఎస్సై టి.ప్రకాశం, యూ.కొత్తపల్లి ఏఎస్సై వి.దుర్గారావు, కాకినాడ 2టౌన్ ఏఎస్సై ఎండీ షరీఫ్‌లను ఎస్పీ సత్కరించారు. అలాగే వారికి అందాల్సిన పదవీ విరమణ ప్రయోజనాలను తక్షణమే అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖలకు ఆదేశాలిచ్చారు.

మహిళా కండక్టర్‌కు సత్కారం


దుర్గాభవానిని సత్కరిస్తున్న ఆర్టీసీ అధికారులు

కాకినాడ సిటీ: స్థానిక ఆర్టీసీ డిపోలో బుధవారం పదవీ విరమణ చేసిన మహిళా కండక్టర్ కె దుర్గాభవానిని డిపో మేనేజర్ ఎంయు మనోహర్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, కె.శ్రీనివాస్, యూనియన్ నాయకులు పాల్గొని పదవీ విరమణ చేసిన దుర్గాభవానిని సత్కరించారు.

నగరపాలక సంస్థ కార్యాలయంలో..


మున్సిపల్ ఉద్యోగులను సత్కరిస్తున్న కమిషనర్ భావన

కాకినాడ సిటీ: నగరపాలక సంస్థ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ పీవీ సత్యప్రసాద్, అడ్మిన్ సెక్రటరీలు మహమ్మద్ అలీబాషా, ఎస్ఎస్ చంద్రమౌళి బుధవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో కమిషనర్ భావన పాల్గొని ఘనంగా సత్కరించారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ


గురజనాపల్లి హైస్కూల్‌లో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

కరప: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పెంచాలని హెచ్‌ఎం ఎ.సాయిమోహన్ పేర్కొన్నారు. మొక్కల వల్ల పాఠశాల కూడా అందంగా కనిపిస్తుందన్నారు. మండలం గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు సొంత ఖర్చుతో రూ.3 వేల విలువైన వివిధ మొక్కలను హెచ్‌ఎంకు అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులతో కలసి హెచ్‌ఎం పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. విద్యార్థులు కూడా తమ పుట్టిన రోజున ఇష్టమైన మొక్కను తీసుకు వచ్చి నాటాలని సూచించారు. ఉపాధ్యాయులు వీవీ రమణమూర్తి, వీజేవీ శోభాకర్, ఎ.సూర్యనారాయణ, ఎన్.నాగలింగేశ్వరరావు పి.భవాని, ఎం.ప్రభారాణి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ మొక్కల పంపిణీ

నడకుదురులో బుధవారం మండల బీజేపీ మాజీ అధ్యక్షుడు రెడ్డి రమణేశ్వర్ ఆధ్వర్యంలో ఆపార్టీ నాయకులు ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేసి, ఆయా ఇళ్ల వద్ద వాటిని నాటారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కాకినాడ రూరల్ అసెంబ్లీ ఇన్‌చార్జి గండి కొండలరావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడి ఆదేశాల మేరకు ఈ నెల 15వ తేదీ వరకు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి కె.ధనరాజు, కోశాధికారి రమేష్‌బాబు, మీడియా ఇన్‌చార్జి తుమ్మలపల్లి నారాయణరావు, మండల పార్టీ నాయకులు ముమ్మిడి పెద్దకాపు, పుట్టా వీరప్రసాద్‌గాంధీ తదితరులు పాల్గొన్నారు.

సుధీర్‌కుమార్ సేవలు ఆదర్శనీయం

ట్రాన్స్‌కో ఎస్ఈ గిరిబాబు


సుధీర్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఎస్ఈ గిరిబాబు తదితరులు

కాకినాడ రూరల్: ఏపీ ట్రాన్స్‌కోలో దాదాపు 41 ఏళ్ల పాటు సేవలందించి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హోదాలో పదవీ విరమణ పొందిన కలవల జాన్ విక్టర్ సుధీర్‌కుమార్ ఆదర్శనీయుడని ఎస్ఈ ఇ.గిరిబాబు పేర్కొన్నారు. రమణయ్యపేటలోని ట్రాన్స్‌కో కార్యాలయంలో సుధీర్‌కుమార్ పదవీ విరమణ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎస్ఈ గిరిబాబు, ట్రాన్స్ కో మాజీ డైరెక్టరు ప్రవీణ్‌కుమార్ హాజరయ్యారు. సహోద్యోగులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ మెరుగైన సేవలందించడంతో సుధీర్‌కుమార్ రాష్ట్ర స్థాయిలో బెస్ట్ సర్వీస్ అవార్డు పొందారని వారు కొనియాడారు. అనంతరం సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో రహమతుల్లా, విజయ్‌కుమార్, చంద్రప్రసాద్, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది


లక్ష్మీనారాయణశర్మను సత్కరిస్తున్న గ్రామస్తులు

కరప: విద్యా బుద్ధులు నేర్పి, విద్యార్థులను ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయ వృత్తే గౌరవప్రదమైనదని సర్పంచ్ వాసంశెట్టి రామారావు పేర్కొన్నారు. మండలం వలసపాకలలోని ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయుడు పోచనపెద్ది వీరవెంకట సుబ్రహ్మణ్య లక్ష్మీనారాయణశర్మ పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం సర్పంచ్, గ్రామస్తులు లక్ష్మీనారాయణశర్మను ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. చాట్ల ఇమ్మాన్యుయేలు, వాసంశెట్టి వెంకటరమణ, వాసంశెట్టి రాముడు తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.